# ప్రేకాట

**తమిళ కథ**

**- జయకాంతన్**

**దండెం మీదున్న చీరను విదిలించి కట్టుకున్న తరువాత గోడకు వ్రేలాడుతున్న అద్దం ముందుకొచ్చి నిలబడ్డ జానకి, దువ్విన తలను మళ్ళీ ఒకసారి సరిచేసుకుంది. నుదుట దిద్దుకున్న కుంకుమ తిలకం చెమటకు తడిసి కాస్త చెదిరినట్టనిపించింది. ఉంగరపు వేలి కొసకు చీర కొంగును చుట్టుకుని తిలకం చుట్టూ ఒక రేఖామాత్రం సరిచేశాక బొట్టు కొస్త చిన్నదిగా ఉన్నట్టనిపించింది. అది కూడా బాగానే ఉందన్న తృప్తితో, గాజుల డబ్బాలో నాలుగ్గా మడిచి పెట్టిన ఇరవై రూపాయల నోటును అలాగే మడతలు విప్పకుండా తీసి చీర కొంగులో ముడివేసి వెనక్కు తిరిగింది. ఆమె వెనుక ఆమె కొడుకు రవి, ఏడాదిన్నర వయసున్న పసివాడు- సన్నగా పొట్లకాయల్లా వ్రేలాడుతున్న కాళ్ళను నేలమీద దేక్కుంటూ ఆమె కాళ్ళవద్దకు వచ్చి తన రెండు చేతుల్నీ ఆమె ముందు పైకి చాపాడు.**

పసివాణ్ణి అలాగే పైకెత్తి కిటికీ అంచుపై కూర్చో బెట్టి, దండెం మీద ఉతికి ఆరేసిన చొక్కాను తీసి వాడికి తొడిగింది. తలకు కాస్త కొబ్బరి నూనె రాసి, శుభ్రంగా తలదువ్వి, పౌడర్ రాసి, బుగ్గపై ముద్దు పెట్టి- రెండు చేతులతో దిష్టితీసి, స్టాండ్‌లో ఉన్న పాత టైమ్‌పీస్‌కేసి చూసినపుడు టైమ్-రెండైంది.

''ఈ మండే ఎండలోనా బిడ్డనెత్తుకొని సినిమాకె ళతావ్?'' తానలా అడగటంతో ఎక్కడ కోపగించు కుంటుందోనన్న భయంతో నొసలు ముడివేసి అడి గింది సరస్వతమ్మ.

''అవును...వెళతా... ఏమిప్పుడు?''

''మహారాణిలా వెళ్ళిరామ్మా... ఎండ నిగడ కాస్తోందేనని చెప్పా... అంతలోనే- ఏమిటో నేను అత్తగారి పెత్తనాన్ని చెలాయించడానికి వచ్చేశా నని... రుసరుసలాడుతున్నావే...''

''అత్తగారి పెత్తనాన్ని చెలాయించండి, ఎవరు కాదన్నారు? కానీ అంతకన్నా ముందు మీ కొడుక్కి భర్త స్థానం ఏమిటన్నది నేర్పించండి?!'' జానకికి ఇలాగే సూటిపోటిగా మాట్లాడ్డం తెలుసు. 'అది న్యాయమే కదా' అని సహిస్తోంది సరస్వతమ్మ.

''నేనేం చెయ్యను?... కన్నకడుపు కొట్టుకొని ఓసారి ఏడవచ్చు'' అని కడుపు మీద కొట్టుకుంది సరస్వతమ్మ.

''వాడికేమిటే తక్కువ? వాడితో కాపురం చేసి, ఒక బిడ్డనూ కని, వాణ్ణెందుకిలా చులకన చేస్తావ్?'' అని ఒకసారి ప్రశ్నించి సరస్వతమ్మ పడ్డ పాట్లు ఆమెకు తెలుసు. ఒక్కోమాట కాదు అడిగింది! అయ్యయ్యో-

''మీరే కన్నారు, బాధపడ్డం న్యాయం. ఊళ్ళో పిల్లను తీసుకొచ్చి ముడిపెట్టిన పాపానికి కలిపి ఇంకా బాగా కొట్టుకుని ఏడవండి! రారా చిన్నా, మనం వెళతాం'' అని పసివాడితో అంటూ బయలు దేరింది జానకి.

''ఎంత కాదన్నా మొగుడితో ఒకమాట...'' అని ఏదో చెప్పడానికి ప్రయత్నించి సరస్వతమ్మ. కానీ మాటలు బయటికి రాలేదు. జానక్కికూడా ఆ ఆలో చన వచ్చిందో, ఏమో?

''ఊఁ... గొప్ప మొగుడు!'' అని గొణుక్కుంటూ వీధిలోకి నడిచింది జానకి.

సరస్వతమ్మ గుమ్మం వద్ద నిలబడి, ఆమె వెళుతూ ఉండడాన్ని చూస్తూ ఉండిపోయింది.

కణకణలాడే చంద్రనిప్పుల్లాంటి మే మాసపు ఎండలో, తారురోడ్డు సెగలో, కాళ్లకు చెప్పులు కూడా లేకుండా, బిడ్డనెత్తుకొని పోతోందే! అది, సిని మాలపై ఉన్న మోజా?

కొన్ని సమయాలలో ఆమెకిలాంటి ఒక ఆవేశం కలుగుతుంది. అంగవైకల్యం కలిగి...హేళనకు గురి కాబడ్డ... రోగులకు కలిగే పిచ్చిలాంటిదది. దాన్ని ఎప్పుడో ఒకప్పుడు ఇలా ప్రదర్శిస్తే కానీ, అది తగ్గదు, జానకికి జీవితంలో వైకల్యం!

ఆ వైకల్యం?

జానకి కనుమరుగయ్యేంతవరకూ గుమ్మం వద్దే నిలబడ్డ సరస్వతమ్మ ఓ నిట్టూర్పుతో ఇంట్లోపలికి అడుగుపెట్టింది. హాల్లోని గోడకు జానకీ, కొడుకు శివ సామి పెళ్ళి బట్టలతో ఉన్న ఫొటో ఆమె కళ్ళబడింది.

శివసామి ఆమె కన్నకొడుకే. కానీ ఆ పెళ్ళి ఫొటోను చూసి సంబరపడేలా లేదు ఆమెకు.

అందానికి ప్రతిరూపంలా నిలబడున్న జానకి పక్కన, ఆమె కొచ్చిన కనుగుడ్లు, ఎత్తుపళ్ళతో... మొరటుగా నవ్వుతూ నిలబడున్న ఈ అనాకారా?

''పాపం జానకి!''

పెళ్ళికి ముందు ఏమేమి కలలు కందో? పగిలిన కలలతో, భగ్న హృదయంతో అతడి పక్కన ఎలా నుంచుందో?–

'నేనే పాపిని. మహా పాపిని! నా కొడుకు అన్న కారణంగా ఈ అందాల రాశి జీవితాన్ని బలిచేశానే' సరస్వతమ్మ చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

ఊరంతా శివసామి భార్యను చూసి ఆశ్చర్యపోయారు. ఊళ్ళో ఉన్న చిన్నపిల్లలు సైతం శివసామిని ఒట్టి 'శివసామి' అన్న పేరుతో పిలవరు. 'గుడ్ల గూబ శివసామి, మరుగుజ్జు శివసామి, జాపాన్ శివసామి' వాటినంతా వింటున్నప్పుడు సరస్వతమ్మ తల్లి హృదయం ఎంతగా తల్లడిల్లిపోయేది!

అలాంటి శివసామికి అందాల ఈ పేదరాలు జానకిని ముడిపెట్టి కసి తీర్చుకున్నామని ఆనంద పడ్డ సరస్వతమ్మ, కొద్దికాలానికే తానెంత పాపానికి ఒడిగట్టిందో తెలుసుకుని క న్నీళ్ళు కార్చడం ప్రారంభించింది.

శివసామికి అందం లేదన్న లోటుతో...మొరటు గాడన్న పేరుతో... ముక్కుమీద కోపం ఉందని తెలుసుకుని... దాన్ని అనుభవించిన జానకి, తన జీవితం నరకమైపోయిందని ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకుంది. అలాంటి సందర్భాల్లో సరస్వతమ్మ ప్రేమ పూరిత మాటలు, స్వాంతన పలుకులు ఆమెకు ఓదార్పునిచ్చి ఆమెను బ్రతికించింది.


ఆమెను కలకాలం బ్రతికించటానికి ఆమె కడుపున రవి పుట్టాడు. పిల్లాడు పుట్టాక జానకికి ఒక విధమైన అహంభావమూ, పట్టుదలా పుట్టుకొచ్చాయి. శూన్యమైపోయిన జీవితపు చీకట్లో, తానుగా ఒక దీపాన్ని వెలిగించి తన చేత్తో పట్టుకున్న గర్వమది.

జీవితంలో ఏర్పడ్డ... అనుభవించిన... మనసుకు మాత్రమే అర్థం కాగలిగిన– ఆ వైకల్యంపై కసి తీర్చుకునేలా అందరినీ చులకన చేసేది జానకి. మరి భర్త? అతడు ఆమెను లక్ష్యపెట్టలేదుగా? ఈమె అతణ్ణి చులకన చెయ్యటం అతడికి అనుభవమే. ఎప్పుడైనా కొన్ని సందర్భాల్లో అధికారం చలాయించడం పురుష లక్షణమనుకునే వాడతను. ఆ సమయాల్లో అతడికి భయపడకుండా బదులిచ్చేది జానకి.

ఆమె గుండెలో నుండి బయటికి తన్నుకొచ్చే మాటల్ని చెవినేసుకోకుండా, ఆమె చెప్పే మాటల్లోని అంతరార్థాన్ని అర్థం చేసుకోకుండా, 'తననెదిరించి మాట్లాడుతోందన్న' ఒకే భావనతో గుడ్డిగా ఆమెను తన్ని తగలేసేవాడు శివసామి.

''ఇవన్నీ చూడ్డానికే కదా ముడిపెట్టారు, ఈ అందగాడి సుపుత్రునితో? చూడండీ, కళ్ళు చల్లబడేట్టుగా చూడండీ...'' అని సరస్వతమ్మను చూస్తూ అరిచేది జానకి.

''న్యాయమే, కదూ... ఆమె చెప్పేది న్యాయమే కదూ...'' అని



గొణుక్కుంటూ, వీళ్ళ గొడవ సద్దుమణిగేంతవరకూ ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోయేది సరస్వతమ్మ.

కానీ ఈ గొడవ ఎప్పుడో ఒకరోజు మాత్రమే జరిగేది. మిగతా రోజులలో శివసామి తెలివితక్కువగా ఏదో గొణుక్కుంటుండేవాడు... దాన్ని ఎవరూ పట్టించుకునే వారు కాదు.

ఆఫీసు నుండి వచ్చాక శివసామి ఇంటి అరుగు మీద పేకాట కచ్చేరీ మొదలవుతుంది. శివసామి తప్ప మిగిలినవారందరూ వేరే వీధి వాళ్ళే. అందులో ఒకడు రామభద్రన్. శివసామి పనిచేసే ఆఫీసులోనే అతనూ పనిచేస్తున్నాడు. ఇల్లు తాంబరంలో ఉంది. అతడొచ్చేశాడంటే, చివరి కరెంట్ ట్రైన్‌కు పది నిమిషాలుందని ఎవరైనా హెచ్చరిస్తేనే ఈ కచ్చేరీ ముగుస్తుంది.

గంట ఎనిమిదయ్యేసరికి జానకి ఎవరికోసమూ ఎదురు చూడకుండా తను మాత్రం పసివాణ్ణి దగ్గరకు తీసుకుని పడుకునేది. సరస్వతమ్మ గుమ్మం వద్ద తలపెట్టుకుని కోడినిద్రపోతూ, ''శివసామీ, గంట పదయింది రా!'' అనగానే అతడు లేచి వచ్చేవాడు. వాళ్ళందరూ వెళ్ళిపోయాక భోజనం చేస్తున్నప్పుడు కూడా- ఆటలో తన పాయింట్స్ గురించీ... మిడిల్ డ్రాప్ గురించీ... మాట్లాడుతూనే ఉండేవాడు.

***

''అమ్మా- ఏం ఫొటోనే చూస్తూ నిలబడ్డావ్?.... నా కొడుకు ఇంకోసారి ఎప్పుడు కాశీయాత్రకు వెళతాడాని చూస్తున్నావా? నాకూ ఇష్టమే... సరే, సరే ఇప్పుడు కాఫీ పెట్టిస్తావా? ఓ నాలుగు కప్పులు...'' అన్న గొంతు వినిపించి వెనక్కు తిరిగి చూసింది సరస్వతమ్మ. అరుగు మీద గుంపు చేరారు.

''ఓహో... ఇవ్వాళ శనివారమా? దానికేం... పెట్టిస్తాను. ఇంకా పాలవాడు రాలేదు, వచ్చే టైమయింది!'' అని చెప్పి వాడి హాస్యాన్ని పట్టించుకోకుండా ముఖం తిప్పుకుని వంటగదికేసి నడిచింది సరస్వతమ్మ.

''జానకి ఎక్కడ?''

''సినిమాకెళ్ళింది.''

''ఎవర్నడిగి వెళ్ళింది?''

''ఎవర్నడిగి వెళ్తుంది... నన్నే.''

''లేదు, దానికి బాగా గర్వం పట్టుకుంది. ఈ ఎండలో ఆ అవిటి నాకొడుకును ఎత్తుకుని... ఊc...రానీ చెప్తా...'' అని కోప్పడ్డాడు శివసామి.

''ఏరా నాయనా, తప్పేంటీ? ఈ ఎండలో గాలి కూడా లేకుండా ఈ ఇంట్లో మగ్గిపోయేదానికన్నా- వెళ్ళిరామ్మా అని నేనే దాన్ని పంపించాను''

''సరే, సరే ఎక్కడికన్నా వెళ్ళి చావనీ...'' అని పేక కట్టల్నీ, చాపనూ తీసుకుని అరుగు మీది కెళ్ళాడు శివసామి.


''ఏంట్రా, రామభద్రన్ ఏడీ? ఈ రోజు కూడా రాలేదు...'' అన్న గొంతు అరుగు మీద నుండి వినిపించింది.

''మనం నలుగురం ఉన్నాంగా, లేనివాడి గురించి మనకెందుకు బాధ. నువ్వు కలుపరా!''

శివసామి పేకల్ని కలిపి ఆట మొదలు పెట్టాడు.

***

'ఈడూ జోడూ' అన్నదంతా సినిమాల్లో మాత్రమేనా? వాళ్ళిద్దరూ ఎంత



సంతోషంగా ఆడుతూ పాడుతూ... అవన్నీ సిని మాల్లో మాత్రమేనేమో-' చంకలో పసిపిల్లాణ్ణి ఎత్తుకుని నడుస్తున్న జానకిని రాసుకుంటూ ఓ సిల్కుచీర ముందుకు కదిలింది. జానకి తల పైకెత్తి చూసింది.

ఓ యువ జంట! గుంపులో... ఆమె నడుము చుట్టూ చెయ్యి వేసి- దాదాపు హత్తుకున్నట్టు- ఆ సూటువేసుకున్న వ్యక్తి - అతడూ అందగాడే- నడుస్తున్నప్పుడు అతడి భుజంపై... తళతళలాడే బుష్ కోటులో చెంపల్ని రాస్తూ నడుస్తోంది ఆ సిల్కుచీర.

'ఆమె ఎంత ఆనందంగా.... సినిమాలో చూసి నట్టు, నిజ జీవితంలోనూ సంతోషంగా ఉన్నవాళ్ళు చాలా మందే ఉన్నారు...

నేను మాత్రమే దురదృష్టవంతురాల్ని... అలాంటి వాళ్ళు ఉంటారన్న నమ్మకాన్ని కూడా నా జీవితం కలిగించలేకపోయింది'- ఎందుకో ఆమెకు దుఃఖం పొంగుకు రాసాగింది. సినిమా చూస్తున్నప్పుడు... అందరూ సంతోషంగా అనుభ విస్తున్న ప్రేమ సన్నివేశాల్లో కూడా... ముందు సీట్లో కూర్చున్న వాళ్ళు ఈల వేసి గోలచేసే సీన్ లలో కూడా... ఆమె ఆతృతతో దాన్ని చూసినా, లోలోన ఓ అసూయా, తపనా, దుఃఖమూ కలగ లసి కొన్ని సమయాల్లో కన్నీళ్ళు కారే పరిస్థితి కూడా కలిగింది జానకికి... ఔను; అదే ఆ వైకల్యం! ఆ వైకల్యానికి అసూయపడ్డంలోనూ, తపించడం లోనూ, కన్నీళ్ళు కార్చడంలోనూ ఓ సుఖముంది. అందుకే ఆమెకు సినిమా పిచ్చి పట్టుకుంది.

థియేటర్ కాంపౌండ్‌ను వదిలి బయటికొచ్చాక ఎదురుగా ఉన్న హోటల్‌కేసి నడిచింది.

హోటల్లోపలికి వెళ్ళి, గోడవారగా ఉన్న ఓ మేజా ముందు కూర్చొని 'స్వీటు' ఆర్డర్ చేసింది.

సర్వర్ పట్టుకొచ్చిన జాంగ్రీని కొద్దికొద్దిగా పసి వాడికి తినిపించింది. తర్వాత కాఫీని చల్లారుస్తున్న ప్పుడు, ఎవరో తనను చాలాసేపటి నుండి తదే కంగా చూస్తున్నట్టు అనిపించింది. 'ఒకవేళ ఆయ నేమో?' తల తిప్పి చూస్తే, ఆమెకు ఎదురుగా రామభద్రన్ కనిపించాడు.

'ఎక్కడో చూసిన ముఖంలాగానే ఉందే...?' అనుకుంటూ అతణ్ణే కాస్త దీక్షగా చూసి- 'తన భర్తతో పేకాడ్డానికి వస్తాడుగా...' అని గుర్తుపట్ట డానికి కొంతసేపు పట్టింది.

రామభద్రన్ నవ్వుతూ జానకిని చూశాడు.

జానకి కూడా చిన్నగా నవ్వింది.

రామభద్రన్‌ను ఇవ్వాళే ఆమె పూర్తిగా చూడ్డాం. అతడెంత అందంగా... నాగరికుడుగా ఉన్నాడు!

జానకి అందాన్నీ, తెలివినీ చాలా రోజులుగా గమనిస్తూ... ఆస్వాదిస్తున్నాడు రామభద్రన్.

చెయ్యి కడుక్కోవడానికి లేచి వచ్చినప్పుడు, ఆమె మేజా సమీపానికి వచ్చి నిలబడి... చాలా కాలం నుండి పరిచయమున్న వాడిలా- ''ఇటెక్క డికీ... సినిమాకెళుతున్నారా?'' అని అడిగాడు.

''లేదు- చూసి వెళ్తున్నాం''

''బుజ్జీ... సినిమా చూశావా? బావుందా...?'' అని పిల్లవాణ్ణి బుజ్జగిస్తూ, వాణ్ణి ఎత్తుకుని మేజా మీద నిలబెట్టాడు. పిల్లవాడి కాళ్ళు రెండూ బలహీ నంగా ఉండి, నిలబడలేకపోయాడు.

''ఎందుకు నిలబడలేకపోతున్నాడు?''

''ఏమో తెలియటం లేదు... వాడి వయసు ఏడాదిన్నర కావస్తోంది; ఇంకా నిలబడ్డం రాలేదు... మందులూ, టానిక్ అన్నీ తాగిస్తున్నం. ఒంట్లో... ఏమిటో బలహీనంగా ఉందట. వాళ్ళ నాన్నే 'అవి టోడా'ని పిలుస్తారు. అలాగే అయిపోతాడేమోనని నాకు భయంగా ఉంది''

''మీరేమీ దిగులుపడకండి- ఇంకో ఆరునెలల్లో వీడు నడుస్తాడు... అది వీక్‌నెస్సే కానీ ఇంకేమీ కాదు! అంతలో ఆ చవట వీణ్ణి 'అవిటీ' అని పిలవ టమా? బుజ్జీ, ఇంకోసారి మీ నాన్న అవిటోడా అని పిలిస్తే- 'నీలా అవిటివాణ్ణి కాను నేను' అని చెప్పు, సరేనా?'' అని పిల్లవాడితో చెప్పి జానకిని చూసి నవ్వాడు రామభద్రన్.

జానకికి చివుక్కుమంది. అయినా నవ్వడానికి ప్రయత్నించింది.

సర్వర్ బిల్ తీసుకొచ్చి మేజా మీద పెట్టాడు. జానకి దాన్ని తీసుకోబోతుంటే, 'నేనిస్తాను' అంటూ రామభద్రన్ కూడా బిల్లును అందుకోబో తుంటే, ఇద్దరి వ్రేళ్ళూ స్పృశించి వెనక్కు తీసుకున్న తొందరలో- మేజా మీదున్న బిల్లు, గాలికెగిరి కింద పడింది. రామభద్రన్ వంగి దాన్ని తీసుకున్నాడు.

ఒక్కక్షణం జానకి ముఖం ఎర్రబడింది. ఇంత తొందరగా ఇలాంటి ఒక సాన్నిహిత్య పరిస్థితి ఎలా ఏర్పడింది? అన్న సంభ్రమంతో అతణ్ణి చూసి చిరు నవ్వు నవ్వుతూ పసివాణ్ణి ఎత్తుకుంది.

హోటల్ నుండి బయటికొచ్చేంతవరకూ ఆమె ముఖంలో మెరిసిన మెరుపు మాయలేదు. వెనక నుండి రామభద్రన్ అన్నాడు: ''మీరెందుకు బాధ పడ్డం!! బీచ్‌కెళ్ళి రోజూ ఒక గంట, నడుము వరకూ గుంత చేసి మట్టిలో నిలబెట్టి మూసేస్తే, ఒక నెల లోనే నడవటం మొదలుపెట్టేస్తాడు, కాళ్ళకు బలం వస్తుంది''

''అలాగా?''

''ఔను! మీరు కావాలంటే చేసి చూడండి. నేరుగా ఇప్పుడు ఇంటికేనా వెళ్ళడం.. అప్పుడే వెళ్ళి ఏం చేస్తారు?... ఏరా బుజ్జీ బీచ్‌కు వస్తావా?'' అని పసివాణ్ణి భుజ్జగిస్తూ జానకిని చూశాడు రామభ ద్రన్.


ముందు ఆమెకు వద్దనిపించింది. అతడితో మాట్లాడ్డం... అతడి గొంతును వినడం... అతడి నవ్వును చూడ్డంలో ఏంటో ఒక అనుభూతి, ఏదో ఒక సుఖముంది.

''బీచ్‌కు వెళదామా చిన్నా...!'' అంటూ అత డితో కలిసి నడిచింది.

గంట ఆరుపైనే అయింది. ఇంకా ఎండ తగ్గలేదు. ఓ పడవ నీడలో, నడుము వరకూ తవ్విన గుంతలో రవిని నిలబెట్టి, జానకి... రామభద్రన్ లిద్దరూ ఎదు రెదురుగా మౌనంగా కూర్చొని ఉన్నారు.

జానకికి. ఎందుకో దుఃఖం పొంగుకొచ్చింది. ఓ అపరిచితుడు ముందు ఏడవటానికి సంకోచంగా అనిపించింది. అతడూ ఏవో ఆలోచనల్లో ఆకాశం

## కంగనా కాదనుకున్న మోడలింగ్ పోటీ....



బాలీవుడ్ తార కంగనా రనౌత్ గురించి తెలియని వారుండరు. నటి కాక ముందు కంగనా ఓ మోడల్. మోడల్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి హిమాచల్ ప్రదేశ్ నుంచి ఈ సుందరి ముంబాయికి చేరింది. 2004లో ఓ మోడలింగ్ పోటీలో పాల్గొనడానికి వచ్చిన ఆమె మొదటి ప్రయత్నంలోనే సఫలీకృతురాలైంది. ఆ పోటీలో పాల్గొన డానికి సెలక్ట్ అయింది. అంత వరకూ బాగానే ఉంది. ఆ పోటీలో పాల్గొని ఉంటే ఆమె ఏ స్థాయికి చేరేదో కానీ మధ్యలోనే డ్రాప్ అయిపోయింది. ఆ పోటీ అంతా ఓ ఫార్స్ అని ఆమెకు తెలిసి పోయింది. విజేతను ముందే ఎంపిక చేసారని తెలుసుకున్న కంగనా ఆ పోటీ నుంచి విరమించుకొని తన దృష్టిని బాలీ వుడ్ వైపు సారించింది. ఆ తరువాత జరి గింది అందరికీ తెలిసిందే కదా....!

లోకి చూస్తూ కూర్చున్నాడు, పదేపదే నిట్టూరుస్తున్నాడు; నుదుటిని తుడుచుకున్నాడు.

''ఔనూ, ఇవ్వాళ శనివారం కదూ, ఆఫీసయ్యాక ఇంటికెళ్ళాలనిపించలేదా మీకు...?''

''రెండ్రోజులుగా మనసేం బావుండటం లేదు... నేను ఇంటికీ వెళ్ళలేదు, ఆఫీసుకూ వెళ్ళలేదు...''

''అయ్యయ్యో... అలా చెయ్యొచ్చా? మీ ఆవిడ ఊళ్ళో లేనట్టుంది?'' అని నవ్వింది జానకి.

''అలా ఏగిరేతేనైనా మనశ్శాంతిగా ఉంటుంది.... ఇక్కడే ఉండి నా ప్రాణం తోడేస్తోంది... శనిగ్రహం!''

''ఎందుకు తిడుతున్నారు?... ఒకరోజు మా ఇంటికి తీసుకురండి!''

'అయ్యో దేవుడా, ఇదేం పరీక్ష...' అని తల పట్టుకున్నాడు రామభద్రన్.

''ఏం, మీ ఆవిణ్ణి మేమెవరం చూడకూడదా? రోజూ పేకాడుతున్నారని చెప్పేస్తామని భయమా? భయపడకండి. ఎవరం చెప్పం'' అని నవ్వింది జానకి.

''తప్పకుండా చూసే తీరాలని అనుకునేటట్టుంటే నేను చెప్పే విషయాలు కూడా వినండి... మీ శివసామికి చీరకట్టి చూస్తే చాలు, సాక్షాత్తూ అలాగే మా ఆవిడ... కర్మ.... కర్మ....''

జానకి ఓ క్షణం స్తంభించిపోయింది.

''ఎందుకలా చేసుకున్నారు?''

''తలరాత... వాళ్ళ నాన్నే నన్ను చదివించారు. బోలెడంత ఆస్తుంది- కూతురే వారసురాలు...''

''ఫరవాలేదు. మీకన్నా ఓ తృప్తి...'' అని ఇంకేదో చెప్పడానికి ప్రయత్నించి నాలిక్కరుచుకుంటూ ఏదో గొణిగింది.

''చెప్పండి! మీకేమనిపిస్తుందో అది చెప్పండి! నేనేమనుకోను''

''ఏం లేదు!''

''లేదు, ఏదో చెప్పాలనుకుని దాస్తున్నారు. మనసులో ఏముందో దాన్ని చెప్పేయండి, మనిద్దరి పరిస్థితీ ఒక్కటే అనేగా చెప్పడానికొచ్చారు. మీ ఇంటికి మొదటిసారి వచ్చినప్పుడే... మిమ్మల్ని చూసినప్పుడే నాకు 'అయ్యో పాపం' అనిపించింది. నా పరిస్థితే మీదీ అనిపించింది. అదేగా చెప్పాలనుకున్నారు?''

''ఔను...కాదు... అదీ... మీ పరిస్థితి కన్నా నాది హీనం. మీరు మగాళ్లు; నేను ఆడదాన్ని...! అంతే కాకుండా మీరేదో కృతజ్ఞత కోసం; రేపు మీకుదక్కే ఆస్తి కోసం... నాకేముంది?... నేనెందుకిలా బాధపడాలి?''

....ఒక మాట అతని చెవిన పడేటట్టు; ఒక మాట అతని మనసున నాటుకునేట్టు... తన బాధనంతా వెళ్ళబోసుకుంది జానకి.

తరువాత, ఇద్దరూ మౌనంగా ఇసుకలో ఏవో గీతలు గీస్తూ కూర్చుండిపోయారు.

ఇద్దరూ తమ తమ మనసుల్లో... జీవిత చిత్రంలో- తనవైపున్న ఒక రూపాన్ని చెరిపేసి, దాని స్థానంలో ఎదుటనున్న ఈ రూపాన్ని చిత్రించి చూసుకున్నప్పుడు...

జానకి, సినిమాలో చూసిందే, ఆ నాయికా నాయకుల ముచ్చటైన జంట, వాళ్ళకన్నా గొప్ప జంటగా... వాళ్ళకన్నా మంచి ఈడూ-జోడుగా...

''మీ వయసెంత?'' అడిగాడు రామభద్రన్.

''ఇరవై నాలుగు... మీకూ...?''

''ఇరవై ఏడు...!'' అని నిట్టూర్చాడు రామభద్రన్. జానకి లోలోన నిట్టూర్చింది. ఇద్దరూ చాలా సేపటి వరకూ మౌనంగా తమ తమ మానసిక స్థితిని ప్రదర్శించేలా ఇసుకలో ఏవో పిచ్చిగీతలు గీస్తూ కూర్చుండిపోయారు.

ఉన్నట్టుండి జానకి గలగలమంటూ నవ్వింది. రామభద్రన్ ఒక్కక్షణం భయపడిపోయాడు. నవ్వుతూ అంది జానకి: ''లేదూ... జీవితం ఎంత విచిత్రంగా అనిపిస్తోంది...! మీరంతా పేకాట ఆడుతారుగా... ఆ విధంగా...!!

''ఏంటదీ...?''

''మీక్కావలసిన కార్డులన్నీ మీవద్దే ఉండి, నాక్కావలసిన కార్డులన్నీ నావద్దే ఉంటే... ఈ ఆట కొనసాగుతుందా...?''

''జానకీ, నువ్వెంత అందంగా మాట్లాడుతున్నావ్...!''

'ఇలా ఆయన అంటే...?'అని ఊహించి సంతోషపడింది.

''జానకీ-''ఆమెకు దగ్గరగా జరిగి, ఉద్వేగపూరితంగా- కళ్ళల్లో నీరూ, తపనా కలగలిసిన కంఠంతో- ''జానకీ! మనమే కదూ ఆ కార్డ్సూ...ఆడేవాళ్ళు ఆ శివసామి, లక్ష్మీనూ... పరస్పరం కార్డ్సు ఇచ్చి పుచ్చుకునేదేగా ఆట...? జానకీ! నువ్వు తెలివైన దానివి. నేనేమంటున్నానో అర్థమవుతోందా?''

జానకి కళ్ళను సగంమూసి.... ఆ ఊహ కల్గించిన సుఖంలో తన్ను తాను మైమరిచిపోతున్న సమయంలో... పసిపిల్లాడు రవి, రామభద్రన్ చొక్కాను పట్టుకుని- 'నా...న్నా...' అని ముద్దు ముద్దుగా తేనెలూరేలా పిలిచాడు.

చప్పున జానకి కళ్ళను విప్పార్చి పసివాణ్ణీ... తననూ... ప్రపంచాన్నీ కూడా చూసింది.

''... ఇతను నాన్న కాదురా, చిన్నా... మామయ్య! నాన్న ఇంటికొచ్చి ఎదురు చూస్తుంటారు.... రా, వెళదాం...'' అని ఇసుకలో నుండి పనివాణ్ణి బయటికి తీసి గుండెకు హత్తుకుంది.

''మీ ఆలోచన బాగానే ఉంది... నాకూ నమ్మకం కలుగుతోంది... ఇలాగే ఒక నెలరోజుల పాటు చేస్తే వీడు నడవటం మొదలుపెట్టేస్తాడు. రేపటి నుండి ఆయన్నూ వెంటబెట్టుకుని బీచ్‌కొస్తాను. అనవసరంగా ఆ పేకాట పిచ్చి ఒకటి పట్టుకుంది ఆయనకు...'' అంటూ లేచి నిలబడింది జానకి.

ఏమీ అర్థంగాక రామభద్రన్ కూడా లేచి ఆమె వెనకే నడిచాడు. ఉన్నట్టుండి అతడు ఆమె పక్కకొచ్చి, ''నామీద కోపమా?'' అన్నాడు.

''మిమ్మల్ని కోపగించుకోవటంలో ఏం న్యాయముంది? ఆ పేకాటను గురించి నేను పూర్తిగా చెప్పలేదుగా? మీరన్నారుగా- ఆడేవాళ్ళు మా ఆయనా, మీ ఆవిడా అని...అది చాలా తప్పు. ఆమె కూడా కార్డే. కాకపోతే పాయింట్ లేదని అనుకోండి. ఆడేవాడు మనిషి కాడు, భగవంతుడు ఆయన తప్పు ఆట ఆడుతున్నాడని చెప్పడానికి మనమెవరం...?!''

''జానకీ, మీరేం మాట్లాడుతున్నారు?'' అని ఆశ్చర్యపోతూ నిలబడ్డాడు రామభద్రన్.

''రేపు ఆదివారమే కదూ, లక్ష్మిని కూడా వెంటబెట్టుకుని రండి, ఎన్నో విషయాలు మాట్లాడుకుందాం. ఆమెక్కూడా మాట్లాడ్డం నేర్పిస్తాను. మామయ్యకు నమస్తే చెప్పు చిన్నా... వెళ్ళొస్తాం...'' అంటూ వేగంగా ఇంటికేసి అడుగులు వేసింది జానకి.

పగలూ రాత్రీ కాని ఆ సాయం సమయ ఆహ్లాదాన్ని పోగొడుతూ 'రాత్రయిపోయింది' అని అరిచి చెప్పినట్టు, బీచ్ రోడ్లోని వీధి దీపాలు చమక్కుమని వెలగటం మొదలుపెట్టాయి.

ఒకటే వెలుగు! బయట మాత్రమేనా?!

(అనువాదం: జిల్లేళ్ల బాలాజీ)

